## ఓయూలో నూతన నియామకాలు



వీసీ ప్రొఫెసర్ కుమార్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5: ఉస్మానియా యూనివర్సిటీలోని పలు పరిపాలనాపరమైన పదవుల్లో నూతన అధ్యాపకులను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓయూ రూసా 2.0 (రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్షా అభియాన్ 2.0) నోడల్ ఆఫీసర్‌గా జువాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శ్రీనివాసులు, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (ఆర్‌క్యూస్) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా జాగ్రఫీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శ్రీనగేశ్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాజేంద్రలను నియమించారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, విద్యార్థులు అభినందించారు.

## నేడు సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం

సికింద్రాబాద్,నవంబర్ 5: సికింద్రాబాద్‌లో సమగ్ర కుటుంబ సర్వేను ఎమ్మెల్యే పద్మారావు బుధవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ అధికారి రాయభాగి గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు,నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## అన్నదానం



చిక్కడపల్లి,నవంబర్5: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పొద్దుటూరి నరసింహారావు, తమ్మన రవితేజ సౌజన్యంతో అన్నదానం నిర్వహించామని తెలిపారు.

# తులం బంగారం హామీ ఏమైంది..?



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ నవంబర్ 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన తులం బంగారం ఎప్పుడిస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట్, బేగంపేట్, బన్సీలాల్‌పేట్, మోండామార్కెట్ డివిజన్‌లకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల పెండ్లికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలువాలనే ఆలోచనతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. ఏడాది కావస్తున్న ఇవ్వడం లేదని ఎప్పుడు ఇస్తారనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని లబ్ధిదారులు అడుగుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆర్డీవో, ఎమ్మార్వోలను కోరారు. లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంలో జాప్యం జరుగుతుందని ఆలస్యం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ పాండు నాయక్, కార్పొరేటర్‌లు బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ముషీరాబాద్, నవంబర్ 5: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.7,500 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు ఉన్నాయని దీంతో పేద, బడుగు వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బ కాయిలను విడుదల చేయాలని కోరారు. ఎంఎస్‌ఎఫ్ నాయకులు వరిగడ్డి చందు, తిరుమలేశ్, జీవన్, నాగరాజు, సురేశ్, ఫణిందర్, మణి, భాను, ప్రవీణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్

## జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌కు ఘన నివాళి



చంద్రశేఖర్ ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5: పీడీఎస్‌యూ నిర్మాత కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్ర సాద్ వర్ధంతిని ఓయూ లో మంగళవారం నిర్వహించారు. పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధా న కార్యదర్శి అల్లూరి విజయ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జంపాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర అధ్యక్షుడు రాయిసిడం బాపూరావు, నాయకులు దుర్గం దిలీప్, జశ్వంత్, నవీన్, సుధాకర్, సంతోష్, మనోజ్, అరుణోదయ నాయకులు రాకేశ్, అరుంధతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల లైబ్రరీ నుంచి కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, నాయకులు రుక్మత్ పాషా, వెంకటేశ్, అంజి, క్రాంతి, పవన్, తిరుపతి, సాయి, చందు, అశోక్, నూతన్, భాను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ కులాలు, మతాలు, దోపిడీ, వివక్షత లేని సమాజానికి విద్యార్థి అమరులు జార్జిరెడ్డి, జేసీఎస్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, స్నేహలత పరితపించారని గుర్తు చేశారు.జార్జిరెడ్డి వారసత్వాన్ని కొనసాగిస్తూ పీడీఎస్‌యూ నిర్మాతగా ఎదికి అశేష విద్యార్థులను సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా పోరు కొనసాగిస్తుంటే ఎమర్జెన్సీ చీకటి పాలనలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, పోట్ల రామనర్సయ్యను చిలకలగుట్ట అడవిలో చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని వాపోయారు.

## కార్పొరేటర్ హేమకు ఓయూ డాక్టరేట్



సికింద్రాబాద్,నవంబర్5: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ డాక్టరేట్ పొందారు. ఈ మేరకు ఓయూ అధికారులు డాక్టరేట్‌లు పొందిన వారి జాబితాను మంగళవారం విడుదల చేశారు. ఆ జాబితాలో కార్పొరేటర్ హేమ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె తన గైడ్ సంపత్ కుమార్‌కి , రీసెర్చ్ చేయడానికి సహకరించిన టీ హబ్ , వీ హబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తను డాక్టరేట్ పొందేందుకు సహకరించిన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం స్టాఫ్‌తో పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ఆటోడ్రైవర్ల మహాధర్నాకు మద్దతు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,చిత్రంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి,నవంబర్ 5: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్క్ చౌక్ వద్ద మహాధార్న నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే ముఠా గోపా ల్,బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహలు హాజరై మద్దతు తెలిపారు.



## మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అరెస్ట్..విడుదల

కంటోన్మెంట్,నవంబర్ 5: ఇందిరా పార్క్ వద్ద ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల మహాధర్నా పిలుపులో భాగంగా మంగళవారం బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్‌ను బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి మధ్యాహ్నం విడుదల చేశారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 5 : అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మం గళవారం సాయంత్రం తొమ్మిది మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్,నాయకులు మున్వర్ చంద్, మహ్మద్ అలీ, ప్రవీణ్ రాజ్, గోవింద్ రాజ్, మక్బూల్, చాంద్ పాషా, ప్రవీణ్ రాజ్, అస్లాం పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి సునీల్ మాదిగ

మారేడ్‌పల్లి, నవంబర్ 5: ఖైరతాబాద్‌లో బుధవారం నిర్వహించే ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జిలు రొట్టెల సునీల్ మాదిగ , శ్రీ కిషన్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్ లో ధర్మ యుద్ధం మహా సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించినప్పటికి ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 6న ఖైరతాబాద్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్ లో సభను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సభకు కంటోన్మెంట్ లో ఉన్న ప్రతి ఒక్క మాదిగ బిడ్డ హాజరై విజయ వంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు .

## ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం సరికాదు



బొల్లారం రిసాల బజార్‌లో సమావేశమైన కంటోన్మెంట్ మాదిగ నాయకులు

బొల్లారం,నవంబర్ 5:ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం సరికాదని బొల్లారం ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈఆర్ బాల్‌రాజు అన్నారు.మంగళవారం బొల్లారం రిసాల బజార్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో కంటోన్మెంట్ మాదిగ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా ఇటీవల మాలలు బొల్లారంలో సమావేశం ఏర్పాటు చేసి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ నెల 10న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ మహా సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్, దశరథ్,సుధాకర్,నర్సింగ రావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆశవర్కర్లకు అవగాహన

ముషీరాబాద్, నవంబర్ 5: భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో ఆశ వర్కర్ల విధి, విధానాలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆశవర్కర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలను గుర్తించి ఆరోగ్య వివరాలు సేకరించాలని సూచించారు. మెరుగైన వైద్యం, మందులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

మారేడ్‌పల్లి, నవంబర్ 5: రైళ్లలో బంగారు ఆభరణాలను చోరీలకు పాల్పడుతున్న ముఠాను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి 10 లక్షల విలువ చేసే 131 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 సెల్ ఫోన్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌తో కలిసి రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం, మురిపిరాల గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న, నవీన్, అశోక్ రాంపల్లి ఎక్స్ రోడ్డు నాగారం లోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటూ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకు వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ముఠాగా ఏర్పడి రైళ్లలో ఫోన్‌లను దొంగిలిస్తూ..పోలీసులకు చిక్కారు. అంతేగాక బంగారు ఆభరణాలను దొంగిలించడం మొదలు పెట్టారు. ఈ నెల 5న సాయంత్రం 5 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు.

**మరో కేసులో బాలుడు, వ్యక్తి అరెస్టు..**

రైళ్లలో బంగారు ఆభరణాలను దొంగిలిస్తున్న నిందితుడిని, సహకరించిన బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఫాతిమానగర్, వట్టపల్లి చార్మినార్ ప్రాంతానికి చెందిన సల్మాన్ మహ్మద్ సిద్ధిఖ్ భవన నిర్మాణ కార్మికుడు. వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో...జల్సాలకు అలవాటు పడి రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. చాకచాక్యంగా వ్యవహరించిన రైల్వే పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ మజీద్, రైల్వే పోలీసు సిబ్బంది మహిపాల్‌రెడ్డి, వేణుగోపాల స్వామి, సుఖ్‌దేవ్, హరిలాల్ ,నాగగుబాషా, భవానీ శంకర్, సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పులతో అదృశ్యమై.. పీఎస్‌లో లొంగిపోయి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5: ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఎక్కువ కావడంతో అదృశ్యమైన జంట మంగళవారం వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్సిగుట్ట బాపూజీనగర్‌కు చెందిన చిన్నాల అమరేందర్, చిన్నాల సబిత దంపతులు. అమరేందర్ కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో హెడ్‌వార్డెన్‌గా పనిచేస్తున్నారు. దానితోపాటు చిట్టీల వ్యాపారం నిర్వహించేవాడు. అయితే.. కొంతకాలంగా వ్యాపారంలో తీవ్రంగా నష్టపోవడంతో భార్యతో కలిసి గత నెల 14న బయటకు వెళ్లిపోయాడు. దీంతో బాధితులు అదే ఇంటిలో నివసించే అమరేందర్ సోదరులను వేధిస్తున్నారు. దీంతో అమరేందర్ సోదరుడు రఘుపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా అదృశ్యమైన దంపతులు వచ్చి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. విషయం తెలుసుకున్న బాధితులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. నిందితుల నుంచి డబ్బులు ఇప్పించాలని నినాదాలు చేశారు. గత ఇరవై ఏళ్లుగా స్థానికులను నమ్మించి దంపతులిద్దరూ చిట్టీలు నిర్వహిస్తూ 144 మంది నుంచి సుమారు రూ.11 కోట్లు వసూలు చేసి మోసం చేశారని ఆరోపించారు. భారీ మొత్తానికి సంబంధించిన కేసు కావడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

## ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

బొల్లారం,నవంబర్ 5: ప్రజా పాలన సేవా కేంద్రాలను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయికుమార్,తిరుమలగిరి తహసీల్దార్ అశోక్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ గణేశ్ మాట్లాడుతూ..ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొసాగుతుందని ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, బల్వంత్ రెడ్డి, ఆష్రఫ్, మారుతీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్‌రావుకు ఓయూ డాక్టరేట్



బన్సీలాల్‌పేట్, నవంబర్ 5 : బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ నర్సింగ్‌రావు ఓయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'ఎఫెక్ట్ ఆఫ్ ప్లయోమెట్రిక్ ట్రైనింగ్ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ జనరల్ మోటార్ ఎబిలిటిస్ ఆఫ్ కబడ్డీ అండ్ ఖోఖో ప్లేయర్స్ ఆఫ్ ఉస్మానియా యునివర్సిటీ' అనే అంశంపై ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. దానికి గాను ఆయనకు డాక్టరేట్ లభించింది. తమ కళాశాలలో పనిచేస్తూనే పరిశోధన పూర్తి చేసిన నర్సింగ్‌రావును పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, పూర్వ అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకులు బంగ్లా భారతి, చిన్నబాబు, సుచిత్రాసింగ్, వెంకట్ ఈశ్వర్, శ్రీనివాస్, విజయనిర్మల, తిరుపతి అభినందించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంచందర్

బేగంపేట్ నవంబర్ 5: ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పనితీరు గురించి మంగళవారం బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ నీరజ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు ఈ అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఎలా పని చేస్తాయి, రోడ్డుపై ట్రాఫిక్‌ను ఏ విధంగా నియంత్రణ చేయాలి, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీటీఐ సెంటర్ సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం కోశాధికారిగా నవీన్

ముషీరాబాద్, నవంబర్ 5: పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారిగా భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్ నియమితులయ్యారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో పద్మశాలీలు రాణించేలా కృషి చేస్తానన్నారు.

## నూతన నియామకం



సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పాలూరి సురేశ్ నియమితులయ్యారు. మంగళవారం రాంగోపాల్‌పేట్‌లోని ఆవులమంద కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో సురేశ్‌ను ఎన్నుకున్నట్టు సభ్యులు తెలిపారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మార్యాల జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా ఆగిరి వెంకటేశ్ వ్యవహరించారు.

–బేగంపేట్, నవంబర్ 5:

## నేడు అన్నకూట్ కార్యక్రమం

బేగంపేట్ నవంబర్ 5: . రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జనరల్ బజార్‌లో అతి పురాతన దేవాలయం శ్రీ లక్ష్మీనారాయణ దేవస్థానంలో బుధవారం అన్నకూట్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది కార్తీక మాసం శుద్ధ పంచమి నాడు దేవస్థానంలో స్వామివారికి అన్నకూట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వంటశాలలో వండిన పులిహోర, లడ్డు, బోంది, దద్దోజనం, క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను పూర్తిగా స్వామివారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వాటిని భక్తులకు శాత్తుముర్రై గోష్టి(సంహపంక్తి)లో వితరణ చేస్తామని వారు తెలిపారు. ఈ అన్నకూట్ కార్యక్రమానికి సికింద్రాబాద్ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నట్టు వారు తెలిపారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు.

## మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బొల్లారం,నవంబర్ 5: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని బొల్లారం రిసాల బజార్ శ్రీ బుజిలీ మహంకాళి దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం నిర్వాహకులు రాకేశ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల మొదటి మంగళవారం అన్నదానం చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాకేశ్ కుమార్ జాదవ్, మంగిలాల్, లల్లూ కుమార్, కర్ణాకర్,అవినాశ్, ఆకాశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.